


ఏకదంతాయ.. విభిన్నరూపాయ..

● వైభవంగా వినాయక చవితి

వినాయక చవితి సందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఏకదంతుడు.. విభిన్న రూపాల్లో కొలువుదీరాడు. శ్రీకాకుళంలో పలు చోట్ల మండపాల్లో పరశురాముడిగా, అయోధ్యరాముడిగా, శివుడిగా, త్రిమూర్తులుగా తదితర రూపాల్లో ఉన్న వినాయక విగ్రహాలను నెలకొల్పారు. బలగలో కుమారస్వామిగా ఉన్న వినాయక విగ్రహాన్ని కొలువుదీర్చారు. అంతటా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం శ్రీకాకుళంలోని డీసీసీబీ కాలనీలో వినాయక విగ్రహాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ దర్శించుకున్నారు. వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి రూ.20వేల నగదును కమిటీ సభ్యులు కేంద్రమంత్రికి అందజేశారు.

- శ్రీకాకుళం కల్చరల్





శ్రీకాకుళంలో హైవేపై ప్రవహిస్తున్న వరద నీరు

సిక్కోలు జలమయం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● మంత్రి అచ్చెన్నాయుడు



అరసవల్లి, సెప్టెంబరు 8: జిల్లాలోని వంశధార, నాగావళి నదులకు వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, సముద్ర తీర ప్రాం తాల్లో ప్రజలను సైతం అప్రమత్తం చేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరం ఉంటేనే ప్రజలు బయటకు రావాలని సూచించారు.

నేడు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

నరసన్నపేట/ ఎచ్చెర్ల, సెప్టెంబరు 8: భారీ వర్షాలు కారణంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తూ డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఆర్‌ఐవో పి.దుర్గారావు వేర్వేరుగా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాన్ తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు పడే అవకా శం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదే శాల మేరకు ఇంటర్‌తోపాటు ప్రాథమిక, ఉన్నత, యూపీ పాఠశాలలకు సెలవు ప్రకటించామని వెల్లడిం చారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలకు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని సూచన మేరకు సోమవారం సెలవు ప్రకటించామని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుజాత తెలిపారు.

నేడు 'మీకోసం' రద్దు

శ్రీకాకుళం క్రైం/ కలెక్టరేట్, సెప్టెంబరు 8: జిల్లాపరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీ కోసం' కార్యక్రమాన్ని భారీ వర్షాల కారణంగా ఈ వారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న 'మీ కోసం' కార్యక్రమాన్ని కూడా ఈ వారం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. వచ్చే సోమవారం నుంచి యథావిధిగా 'మీ కోసం' కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

పిడుగుపడి ఐదు గొర్రెలు మృతి

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 8: శ్రీకాకుళం మండలం కళ్లేపల్లిలో ఆదివారం పిడుగుపడి ఐదు గొర్రెలు మృతి చెందాయి. కనుగులవానిపేటకు చెందిన చోడుమూడి నాగరాజు ఆదివారం తన గొర్రెలను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో పిడుగుపడగా.. ఐదు గొర్రెలు మృతిచెందాయి. పిడుగుపాటుకు గురై నాగరాజు అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు ఆయనను శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గొర్రెల మృతితో నాగరాజుకు సుమారు రూ.60వేల వరకు నష్టం వాటిల్లిందని ఎంపీడీవో, తహసీల్దార్‌కు వీఆర్వో సాయిరాజ్ తెలిపారు.

(ఆంధ్రజ్యోతి- శ్రీకాకుళం)

- జిల్లావ్యాప్తంగా కుంభవృష్టి
- పొంగుతున్న నదులు, వాగులు
- నీట మునిగిన పంట పొలాలు
- రహదారులపై వరదనీటి ప్రవాహం
- అప్రమత్తమైన అధికారులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. వాయుగుండంగా మారడంతో జిల్లావ్యాప్తంగా శనివారం నుంచీ కుండపోత వర్షం కురిసింది. ఆదివారం కూడా ఎడతెరిపి లేకపోవడంతో సిక్కోలు జలమయమైంది. నదులు, వాగులు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు, రహదారులపై వరదనీరు చేరి జలమయమయ్యాయి. వర్షపునీటితో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఇదే రీతిన మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం ఇప్పటికే ప్రకటన జారీ చేసింది. ఈ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తమయ్యారు.

● వారం రోజుల కిందట కురిసిన భారీ వర్షాల కారణంగా సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో వరి పైరుకు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆ నష్టం నుంచి తేరుకోకముందే రైతులకు మరింత ఇబ్బంది కలుగజేసేలా వాతావరణం మారిపోయింది. జిల్లాలో అత్యధికంగా తీర ప్రాంతం ఉండడంతో బంగాళాఖాతంలో సంభవించే తుఫాన్లు వల్ల తరుచూ ప్రభావం చూపుతూనే ఉంది. రణస్థలం నుంచి ఇచ్ఛాపురం వరకు సముద్రపు కెరటాలు కొన్ని మీటర్లు ముందుకు వచ్చాయి. తీరప్రాంత ప్రజలు సముద్రం వైపు వెళ్లనీయకుండా అధికారులు గ్రామాల్లో మకాం వేశారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. అన్ని శాఖల అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రజలకు గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మరో 3 నుంచి 5 రోజుల వరకు భారీ వర్షాలు కురవనున్నాయని, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సముద్ర తీరం, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భారీ వర్షాల కారణంగా సోమవారం అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా ప్రజలు అత్యవసర సహాయం కోసం 08942-240557 నెంబరుకు ఫోన్ చేసి కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ స్పష్టంచేశారు. అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో నిత్యావసరాల కొరత లేకుండా ముందస్తుగా సరుకులను తరలించాలంటూ అధికారులను ఆదేశించి, చర్యలను పర్యవేక్షించారు.

● ఆదివారం సాయంత్రానికి అత్యధికంగా రణస్థలంలో 70 మి.మీ వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళం నగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్, బలగ, హడ్కోకాలనీ, రామలక్ష్మణ జంక్షన్, డే అండ్ జంక్షన్‌ల్లో కాలువల నీరు వర్షపు నీరు కలిసి ప్రవాహాన్ని తలపించాయి. వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అలాగే జి.సిగడాం మండలంలో పెంట గ్రామంలో సీసీ రహదారి కోతకు గురైంది.


జలదిగ్బంధంలో ఆర్టీసీ కాంప్లెక్సు


పాతపట్నం: కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న మహేంద్రతనయ నదీ జలం


పొందూరు: చినబొడ్డేపల్లి వద్ద అండర్ ప్యాసేజీలో నీటిలో చిక్కుకున్న వాహనాలు


హరిపురం: రట్టి వద్ద ముందుకు వచ్చిన సముద్రం

పొంగిప్రవహిస్తున్న నదులు, గెడ్డలు..

నాగావళి, వంశధార, బాహుదా నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఒడిశాలో కూడా భారీ వర్షాలు కురుస్తుండడంతో మడ్డువలస ప్రాజెక్ట్, నారాయణపురం ఆనకట్ట, గొట్టా బ్యారేజీలో వరద ఉధృతి మరింత పెరిగింది. ముందస్తు చర్యల్లో భాగంగా నారా యణపురం ఆనకట్ట నుంచి 18,500 క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెట్టారు. గొట్టాబ్యారేజీ నుంచి గేట్లను కొద్దిమేర తెరిచి 7,196 క్యూసెక్కుల నీటిని వంశధారలోకి విడిచిపెట్టారు. ఇక చెరువులన్నీ నీటితో నిండిపోయాయి. జలుమూరు, పోలాకి, సారవకోట, నరసన్నపేట, శ్రీకాకుళం మండలాల్లో వరిపైరు ముంపునకు గురైంది. బహుదానదిలో ఒడిశా నుంచి వర్షపు నీరు చేరడంతో ఉప్పొంగింది. మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు.

● లావేరు మండలంలో అదపాక- గుర్రాలపాలేం, రాయినింగారిపేట, బెజ్జిపురం- బుడతవలస, లక్ష్మీపురం-పట్నువానిపేటలకు వద్ద పెదగెడ్డ ఉధృతంగా పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బెజ్జిపురం- బుడత వలస మధ్య పెద్దగెడ్డ ఉధృ తంగా ప్రవహించింది. దీంతో ఆ వరద ఉధృతిలో ఓ లగేజీ వ్యాన్ కొంతదూరం వరకు కొట్టుకు పోయింది. స్థానికులు వెంటనే ట్రాక్టర్ సహాయంతో కొట్టుకు పోయిన వ్యాన్‌ను బయటకు తీసుకువచ్చారు. అలాగే రణస్థలం మండలంలోని కోటపాలేం రెవెన్యూ పరిధిలో ఉన్న బుచ్చివాని గెడ్డ పొంగి ప్రవహించింది. బీటీ రోడ్డుమీదకు నీరు రావడంతో రాకపోకలు స్తంభించాయి.


లావేరు : బుడతవలస గెడ్డలో కొట్టుకు పోయిన వ్యాన్‌ను ట్రాక్టర్ సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం


లావేరు : రాయినింగారిపేట వద్ద ప్రవహిస్తున్న గెడ్డ


రణస్థలం : పొంగి ప్రవహిస్తున్న కోటపాలేం బుచ్చివాని గెడ్డ


ఆమదాలవలస: దాలినాయుడు క్వార్టర్స్‌లో ఇళ్లల్లో ప్రవేశించిన వర్షపునీరు


జి.సిగడాం: గెడ్డ కంచరాం పెద్ద గెడ్డలో నుంచి రాకపోకలు సాగిస్తున్న గ్రామస్థులు..


జి.సిగడాం: పెంట గ్రామానికి వెళ్లే సీసీ రహదారి కోతకు గురైన దృశ్యం

కూలిన ఇళ్లు.. గోడలు

(హిరమండలం/టెక్కలి/లావేరు/ జి.సిగడాం /ఎల్.ఎన్.పేట)

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో పలుచోట్ల ఇళ్లు, గోడలు కూలిపోయాయి. హిరమండలంలోని సుభలయ ఆర్‌ఆర్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ కొంతభాగం ఆదివారం కూలిపోయింది. కూలిన గోడను ప్రత్యేకాధికారి రామ్మోహన్, తహసీల్దార్ బి.వెంకటరమణ, ఈఓపీఆర్డీ నాగమణి పరిశీలించారు.

● టెక్కలిలోని భూలోకమాత వీధిలో నాగవంశపు శ్యామలరావు ఇంటి గోడ వర్షాలకు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న శ్యామలరావు, భార్య, కుమారులు ఒక్కసారిగా బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పింది.

● లావేరు మండలం చినమురపాకలో కెంబూరి సీతమ్మకు చెందిన పూరిల్లు కూలి నేలమట్టమైంది. అలాగే జి.సిగడాంలో నాగవరపు సన్యాసిరావుకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. ఆ సమయంలో సన్యాసిరావు, ఆయన భార్య పార్వతి వెంటనే అప్రమత్తమై బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పింది.

● ఎల్.ఎన్.పేటలోని మల్లిఖార్జునపురం జంక్షన్‌లో శనివారం ఓ చెట్టు నేలకొరిగి.. కిరాణా దుకాణంపై పడింది. దీంతో ఆ దుకాణం ధ్వంసమై.. నష్టం వాటిల్లిందని వ్యాపారి శ్రీకాంత్ వాపోయాడు.


టెక్కలి: భూలోకమాతవీధిలో కూలిన ఇంటి గోడ


లావేరు : చినమురపాకలో కూలిన పూరిల్లు


హిరమండలం: సుభలయ ఆర్‌ఆర్ కాలనీలో కూలిన పాఠశాల ప్రహరీనీ పరిశీలిస్తున్న అధికారులు


ఎల్.ఎన్.పేట: చెట్టు విరిగి ధ్వంసమైన దుకాణం

2024 మార్చి 21న ఎం.కె.రంజిత్ సిన్హా అండ్ అదర్స్ కేసులో వాతావరణ మార్పుల దుష్ప్రభావాలనుంచి పర్యావరణాన్ని రక్షించుకోవడం 'ప్రాథమిక మానవహక్కు' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు చొరవ ప్రదర్శించి, క్రియాశీలతతో తీర్పును వెలువరించినట్లుగా పర్యావరణ ప్రేమికులు, మేధావులు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంలో న్యాయ వ్యవస్థ క్రియాశీలతను సమగ్రంగా అధ్యయనం చేద్దాం.

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

న్యాయ వ్యవస్థ క్రియాశీలత



న్యాయశాఖ క్రియాశీలత అనేది న్యాయసమీక్షాధికారంలో అంతర్భాగం. న్యాయశాఖ క్రియాశీలత అనగా న్యాయవ్యవస్థ తన అధికార విధులను మరింత చొరవగా, క్రియాశీలకంగా, ఉదారంగా వినియోగించడం. న్యాయాన్ని ప్రజలకు అందించే క్రమంలో అనేక నూతన పద్ధతులను, ప్రక్రియలను వినియోగించి సమ న్యాయపాలనకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతుంది. సామాజిక హక్కులను రక్షిస్తూ, సామాన్య ప్రజలకు న్యాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సుప్రీంకోర్టు, అపెక్స్ జ్యుడీషియల్ బాడీగా దీనికి కేంద్ర బిందువు అయ్యింది.

న్యాయపరమైన కృతశీలత అనేది చట్టాలను చొరవతో, చురుగ్గా వివరించే సందర్భాలను సూచిస్తుంది. న్యాసమీక్ష సాంప్రదాయ సరిహద్దులను దాటి రాజ్యాంగ విలువలను సమర్థించే విషయాల్లో జోక్యం చేసుకుంటుంది.

న్యాయవ్యవస్థ క్రియాశీలత - పరిణామం

గోలక్‌నాథ్ కేసు సుప్రీంకోర్టుకు వచ్చేవరకు ప్రాథమిక హక్కుల సవరణతోపాటు పార్లమెంటు చేసిన చట్టాలన్నింటిపై సుప్రీంకోర్టు ఎలాంటి విభేదాన్ని ప్రకటించలేదు. కానీ 17వ రాజ్యాంగ సవరణ(1964) ద్వారా అప్పుడు ప్రాథమిక హక్కుగా ఉన్న ఆస్తిహక్కును సవరిస్తూ పార్లమెంటు చట్టం చేసింది. అయితే ప్రాథమికహక్కు అయి న ఆస్తిహక్కును సవరించే అధికారం ప్రకరణ-368 కింద పార్లమెంటుకు లేదని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు నుంచే పార్లమెంటుకు న్యాయవ్యవస్థకు మధ్య ఘర్షణ ప్రారంభమైందని రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ ఘర్షణ పరోక్షంగా న్యాయవ్యవస్థ క్రియాశీలతకు దోహదం చేసింది. కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు పార్లమెంటు అధికారాలపై పరిమితులు విధిస్తూ పరోక్షంగా న్యాయవ్యవస్థ పరిధిని విస్తృతం చేసింది. ఈ తీర్పులో రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని వెలువరించింది. తరవాత కేసుల్లో కూడా తన తీర్పుల ద్వారా దానిని కొనసాగించింది.

ఎమర్జెన్సీ తరవాత వచ్చిన రాజకీయ-పౌరచైతన్యం వల్ల ప్రజాహిత వ్యాజ్యాలు(పిల్) వాడుకలోకి వచ్చాయి. న్యాయ సహాయాన్ని అందించమని నేరుగా న్యాయవ్యవస్థను కోరేలా ప్రజాహిత వ్యాజ్యాలు ప్రజలను చైతన్య పరిచాయి. శాసన శాఖ, కార్యనిర్వాహక శాఖల బలహీనతే న్యాయశాఖ క్రియాశీలతకు కారణమని రాజ్యాంగవాదుల అభిప్రాయం.

ప్రజాప్రయోజనాల వ్యాజ్యాలు వాడుకలోకి వచ్చినప్పటి నుంచి పౌరులు, స్వచ్ఛంద సంస్థలు మిగిలిన రెండు శాఖల కార్యకలాపాల్లో జోక్యం చేసుకుని 'ప్రజాహితాన్ని' కాపాడమని అర్థించడం న్యాయ వ్యవస్థకు బలాన్నిచ్చాయి. దాంతో కార్యనిర్వాహఖ శాఖ అధికారాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడం మొదలుపెట్టింది. ఉదాహరణకు కావేరి నదీ జలాల సమస్యను చర్చించడానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు సూచించడం. రోడ్లు, వంతెనలు నిర్మించాలని ప్రభుత్వానికి ఆదేశాలివ్వడం, రైళ్ల రాకపోకలకు 'సమయ పాలన' పట్టికలను రూపొందించాలని చెప్పడం, విద్యాసంస్థల్లో అడ్మిషన్లు ఎలా జరపాలో నిర్దేశించడం. ఈవిధమైన తీర్పులన్నింటినీ పరిశీలిస్తున్న రాజ్యాంగ మేధావులు 'న్యాయ వ్యవస్థతో నడుస్తున్న ప్రభుత్వాలు' అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ అతిక్రియాశీలతను కట్టడి చేయడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎ.కె.మాథుర్, మార్కండేయ కట్జూ 'న్యాయ వ్యవస్థ సహేతుకత'ను ప్రతిపాదించారు. తరచుగా ఈ అతి క్రియాశీలతను వినియోగించడం ఆరోగ్యకరమైన సంకేతం కాదని న్యాయమూర్తి హెచ్.ఆర్.ఖన్నా అభిప్రాయపడ్డారు.

న్యాయశాఖ క్రియాశీలతకు కారణాలు

- శాసనశాఖ, కార్యనిర్వాహక శాఖ తమ విధుల నిర్వహణలో వైఫల్యం చెంది ప్రజల నమ్మకాన్ని కోల్పోవడం.
- ఓటుబ్యాంకు రాజకీయాల వల్ల దీర్ఘకాలిక, నిర్మాణాత్మక, కఠినమైన నిర్ణయాలు చేయకపోవడం వల్ల ప్రజల కనీస అవసరాలు కూడా మెరుగుపర్చని స్థితిలో ప్రభుత్వాలు కొనసాగడం.
- ప్రజాప్రయోజనాల వ్యాజ్యంతో మూడో వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయించే అవకాశం లభించింది. దాంతో స్వచ్ఛంద సంస్థలు, పౌర హక్కుల సంఘాలు వందల సంఖ్యలో ప్రజా ప్రయోజనాలున్న కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చాయి.
- న్యాయస్థానాలు స్వయంప్రేరిత కేసులను ప్రవేశపెట్టి ప్రజల హక్కుల కోసం తగిన ఆదేశాలను జారీచేయడం.(ఉదాహరణకు కోర్టుకు వచ్చిన ఉత్తరాల ద్వారా, పేపర్లలో వచ్చిన వార్తల ఆధారంగా తనంత తానుగా ఆ సంఘటనలను విచారణకు స్వీకరించడం).
- దత్త శాసనాధికారాల వల్ల కార్యనిర్వాహక శాఖ అధికారాలు విస్తృతమై అధికార దుర్వినియోగం, జవాబుదారీతనం లోపించడం.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

న్యాయశాఖ క్రియాశీలత - ముఖ్య వివాదాలు

- ఫరీదాబాద్ గనుల్లో పనిచేసే బాల కార్మికుల స్థితిగతులపై బందువా ముక్తి మోర్చా వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు.
- లక్ష్మీకాంత్, యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న మోసాలు, చిన్నపిల్లల దత్తత వివాదంలో సుప్రీంకోర్టు తీర్పులు.
- తాజ్‌మహల్ పరిసర ప్రాంతాల్లో కాలు ష్యం, తద్వారా తాజ్ మహల్‌కు ఉన్న ముప్పుపై కేసులు.
- బిహార్ ఖైదీల కేసు; బిహార్ పశుగ్రాసం కేసు.
- జార్ఖండ్ ముక్తిమోర్చా అవినీతి వివాదం.
- రక్షణశాఖలో కొనుగోలు కుంభకోణాలు మొదలైన వివాదాలు.
- జడ్జిల నియామకం.
- కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.ఆర్.బొమ్మై కేసు(1994)లో 356వ ప్రకరణ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొన్ని సూచనలివ్వడం.
- సతీష్‌శర్మ - పెట్రోల్ బంకుల కేటాయింపుల దుర్వినియోగం.
- గంగానది కాలుష్య నివారణ.
- వాహన కాలుష్యం వల్ల ఢిల్లీవాసుల జీవించేహక్కుకు భంగం కలిగిందంటూ ఒక పౌరుడు వేసిన కేసులో డీజిల్ బస్సులను సీఎన్‌జీ బస్సులుగా మార్చాలని ఆదేశించడం.
- అడవుల్లో చెట్లను విచక్షణారహితంగా నరికివేయడానికి సంబంధించి.
- కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలంటూ ఆదేశించడం.
- ఢిల్లీలో అక్రమ నిర్మాణాలను తొలగించడం.

గుప్తా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1982)లో మహారాష్ట్ర హైకోర్టు తీర్పు చెబుతూ న్యాయస్థానాలు క్రియాశీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొంది. ఆదే విధంగా పీయూడీఆర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1982)ను కూడా ఇక్కడ పేర్కొనవచ్చు. 9వ ఆసియా క్రీడల కోసం చేపట్టిన నిర్మాణాల్లో పాల్గొనడానికి వచ్చిన వారి శ్రమను యాజమాన్యం దోచుకుంటోందని ఒక స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించి కార్మికులకు పని గంటలను నిర్ధారించింది.

1998 ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎం.కె.బెజ్ బారువాను ఆ శాఖ నుంచి మరో శాఖకు బదిలీ చేశారు. ఈ బదిలీ సహజంగా జరిగింది కాదని, ఉద్దేశపూర్వకంగా చేశారని సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టు బెజ్ బారువా బదిలీ విషయంలో కేంద్రప్రభుత్వ చర్యను తప్పుపట్టింది.

- ఐ.ఆర్.కొయల్హా కేసు(2007)లో 9వ షెడ్యూల్‌లోని అంశాలను కూడా న్యాయసమీక్ష చేయవచ్చని తీర్పుచెప్పడం.
- శ్రేయోసింఘాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఐటీ చట్టంలోని సెక్షన్ 66ఏను కొట్టివేయడం(2015).
- ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జిల నియామకాలకు సంబంధించి కొలీజియం వ్యవస్థను పునరుద్ధరించడం(2015)
- రామ్‌సింగ్ కేసు(2015)లో వెనుకబడిన తరగతుల కమిషన్ సిఫార్సులకు వ్యతిరేకంగా జాట్‌లను ఓబీసీల్లో చేర్చడాన్ని కొట్టివేయడం.

దిక్సూచి
DIKSUCHI

లెటర్ రిపీటెడ్ సిరీస్
● రీజనింగ్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

లెటర్ సిరీస్‌కు సంబంధించిన ప్రశ్నల్లో కొన్ని అక్షరాల సమూహాలను ఒక సిరీస్‌గా పేర్కొంటారు. ఈ అక్షర సమూహాలు రకరకాలుగా ఉంటాయి. అనగా 3, 4, 5 లేదా 6 అక్షరాలు గల సమూహాలు రిపీటెడ్‌గా రావడం.

ఉదా: dabc/dabc/dabc/dabc. లేదా

ఒక క్రమపద్ధతిలో అక్షర సమూహాలు విభజించడం.

ఉదా: ab/aabb/aaabbb/aaaabbbb.

గమనించండి: మొదటి సమూహంలో ఒక ab, రెండో సమూహంలో రెండు aలు, రెండు bలు, మూడో సమూహంలో మూడు aలు, మూడు b లు ఇలా ఒక క్రమపద్ధతిని అనుసరించి సిరీస్ ఏర్పడుతుంది. లేదా ఒక్కోసారి చెయిన్ పద్ధతిలో అక్షర సమూహాలు ఉంటాయి.

ఉదా: abc/bca/cab/abc.

మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివర ఉన్నది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక సక్రమమైన చెయిన్ పద్ధతిలో ఈ సిరీస్ ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు ఉండే పద్ధతి

కొన్ని అక్షరాల సమూహాన్ని ఒక సిరీస్‌గా పేర్కొంటారని పైన చెప్పుకున్నాం. ఈ అక్షరాల మధ్య మధ్య కొన్ని అక్షరాలను వదిలేస్తారు. ఆ సిరీస్‌లో వదిలేసిన అక్షరాల సమూహం ఐచ్ఛికాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో ఉంటుంది. కాబట్టి ప్రశ్నగా ఇచ్చిన సిరీస్ ఏ క్రమపద్ధతిని అనుసరిస్తున్నదో తెలుసుకోవాలంటే ఐచ్ఛికాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో గల అక్షరాలను ప్రశ్నలోని ఖాళీల్లో పూరించి సిరీస్‌ని అవగాహన చేసుకోవాలి. సమాధానాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో ఏ ఆప్షన్‌లోని అక్షరాలను ఖాళీల్లో పూరించిన ఆ సిరీస్ క్రమపద్ధతిని అనుసరిస్తుందో ఆ ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించాలి.

ఈ సిరీస్‌కు సంబంధించిన ప్రశ్నలలో అభ్యర్థి ముందుగా ఆ సిరీస్‌లో ఉపయోగించిన అక్షరాలు గమనించాలి. మూడు అక్షరాలు ఉపయోగిస్తే మూడు అక్షరాల సమూహంగా నాలుగు అక్షరాలు ఉపయోగిస్తే నాలుగు అక్షరాల సమూహంగా విభజించే అవకాశం ఉంది. అలా కాని పక్షంలో

1. సిరీస్‌లో మొత్తం 12 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 3 లేదా 4గా విభజించే అవకాశం ఎక్కువ.
2. సిరీస్‌లో మొత్తం 16 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 4గా విభజించే అవకాశం ఎక్కువ.
3. సిరీస్‌లో మొత్తం 15 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 3 లేదా 5గా విభజించే అవకాశం ఎక్కువ
4. సిరీస్‌లో మొత్తం 20 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 4 లేదా 5 విభజించే అవకాశం ఎక్కువ
5. సిరీస్‌లో మొత్తం 14 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 2/3/4/5 గా విభజించవచ్చు.

ఉదా: PQ/PQQ/PQQQ/PQQQQ

ప్రతి సమూహంలో 'Q' ఒక్కొక్కటి పెరిగింది.

6. సిరీస్‌లో 18 ఉంటే(అక్షరాలు, ఖాళీలు కలిసి) 3 లేదా 4 లేదా 6గా విభజించే అవకాశం ఎక్కువ ఒక్కోసారి 3/4/5/6గా కూడా ఉండే అవకాశం ఉంటుంది.

ఉదా: abc/aabc/aabbc/aabbcc.

మొదటి సమూహం నుంచి రెండో సమూహానికి a పెరిగింది. రెండో సమూహం నుంచి మూడో సమూహానికి b పెరిగింది. మూడో సమూహం నుంచి 4వ సమూహానికి c పెరిగింది. ఈ లెటర్ సిరీస్‌కు సంబంధించి ప్రశ్నలు ఏవిధంగా ఉంటాయో, గత వివిధ పోటీ పరీక్షలలో ఇస్తున్న, ముఖ్యమైన సిరీస్ పద్ధతులను అభ్యర్థులకు ఈ చాప్టర్‌పై అవగాహన కలిగించేందుకు దిగువ ఇస్తున్నాం. దిగువ ఇచ్చిన సిరీస్ పద్ధతులను అభ్యర్థులు కనీసం ఐదు లేదా ఆరుసార్లు చదివి జాగ్రత్తగా పరిశీలించి సిరీస్‌లో అక్షరాల విభజన, సిరీస్‌లు ఏర్పడే విధానం, వాటి స్వభావంపై అవగాహన ఏర్పరచుకొని ఈ చాప్టర్‌పై పట్టుసాధించగలరని ఆశిస్తున్నాం.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ఉండే అక్షరాలు P, Q, R, S లేదా a,b,c,d లేదా K,L,M,N అయి ఉంటాయి.

వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు

1. ab/ab/ab/ab/ab/ab
రెండేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
2. PQR/PQR/PQR/PQR
మూడేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
3. dcab/dcab/dcab/dcab
నాలుగేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
4. adcbc/adcbc/adcbc
ఐదేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
5. dacbad/dacbad/dacbad
ఆరేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
6. abba/baab/abba/baab
మొదటి సమూహంలో గల అక్షరాలు abba. ఈ సమూహంలో చివరి రెండు అక్షరాలు(ba) రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు(ab) రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఉన్నాయి.
రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు (ab) మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు (ba) మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఉన్నాయి. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని అనుసరిస్తూ ఈ సిరీస్ ఏర్పడింది.
7. PQ/PPQQ/PPPQQQ/PPPPQQQQ
మొదటి సమూహంలో రెండు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో ఆరు అక్షరాలు, నాలుగో సమూహంలో ఎనిమిది అక్షరాలు ఉన్నాయి. మొదటి సమూహంలో ఒక PQ, రెండో సమూహంలో రెండు Pలు, రెండు Qలు, మూడో సమూహంలో మూడు Pలు, మూడు Qలు ఉన్నాయి. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
8. abc/aabc/aabbc/aabbcc
మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో ఐదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. రెండో సమూహాన్ని గమనిస్తే మొదటి సమూహంలో గల అక్షరాలన్ని ఉంటూ a స్థానం వద్ద మరొక a అదనంగా చేరింది. మూడో సమూహంలో రెండో సమూహంలో గల అక్షరాలన్ని ఉంటూ b స్థానం వద్ద మరో b అదనంగా చేరింది. నాలుగో సమూహంలో మూడో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ c స్థానం వద్ద మరో c అదనంగా చేరింది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

వరదపై ఆగని జగన్ బురద

- వలంటీర్లు ఉంటే సమర్థంగా ఎదుర్కొనేవారట!
- ఎక్స్ వేదికగా జగన్ ట్వీట్.. విరుచుకుపడ్డ నెటిజన్లు
- జగన్ నిర్వాకమే ఈ వరద అంటూ మండిపాటు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ వరదపై తన బురద రాజకీయాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. వలంటీర్లు ఉంటే, ముంపును సమర్థవంతంగా ఎదుర్కొనేవారంటూ మరోసారి విషం కక్కారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం అనేది ఉందా... లక్షల మంది ఉద్యోగులున్న ప్రభుత్వ యంత్రాంగం ఏమైపోయిందంటూ ఆదివారం ట్వీట్ చేశారు. ప్రభుత్వం మారకపోతే, వైసీపీ తరఫున పోరాటం చేస్తామన్నారు. నిజానికి, ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం కలిగిననేతగా, భుజం భుజం కలిపి, వరద బాధితులకు సాయమందించాల్సిన తరుణమిది. అది వదిలేసి జగన్ ట్వీట్ చేసిన బురద రాజకీయ వ్యాఖ్యల పట్ల జల వనరుల నిపుణుల నుంచి ప్రభుత్వ అధికారులు, బాధితులు, నెటిజన్లు వరకు.. సర్వత్రా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా మీ నిర్వాకమే..రాజకీయాలకు ఇదా సమయం అంటూ అత్యధిక నెటిజన్లు విరుచుకుపడ్డారు. సోషల్ మీడియాలో విమర్శలు మాని ఆకలి కేకలు పెడుతున్న బాధితులకు సాయం చేయాలంటూ ఘాటుగా సూచించారు.

వైసీపీ ఎత్తులు చిత్తు

వరద బాధితులకు పరామర్శ పేరిట రాద్ధాంతం చేసేందుకు ప్రయత్నించిన జగన్ ప్రయత్నాన్ని ఇటీవల వరదప్రాంతాల్లో మహిళలే వమ్ము చేశారు. తమకు ప్రభుత్వం నుంచి అన్నివిధాలా సాయమందుతోందంటూ స్పష్టంచేశారు. ఎమీరెంత సాయం అందిస్తున్నారంటూ పరామర్శకు వచ్చిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను మహిళలు నిలదీశారు. దీంతో, బయటకు రాకుండా తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన జగన్ .. ఎక్స్ వేదికగా మాత్రం బురద రాజకీయాలకు తెరతీశారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను కించపరిచేలా ఉన్న జగన్ వ్యాఖ్యలను పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వినాయక చవితి సెలవు దినం కూడా ఉద్యోగులు పనిచేసిన విషయం వారు గుర్తుచేశారు.

బ్రహ్మాజీ కౌంటర్ ట్వీట్...

జగన్ ట్వీట్‌కు సినీనటుడు బ్రహ్మాజీ కౌంటర్ ట్వీట్ చేశారు. ..మీరు కరెక్టు సార్. వాళ్లు చెయ్యలేరు సార్. ఇకనుంచి మనం చేద్దాంసార్. ఫస్ట్ మనం రూ.1000 కోట్లు రిలీజ్ చేద్దాం సర్. మన వైసీపీ కేడర్ మొత్తాన్ని రంగంలోకి దింపుదాం. మనకు జనాలు ముఖ్యం సార్. గవర్నమెంటు కాదు సార్. మనం చేసి చూపిద్దాం సార్.. జై జగన్ అన్నారు అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే, ఆ ట్వీట్ తాను చేయలేదని, తన ఖాతా హ్యాక్ అయిందని, ఫిర్యాదు కూడా చేశానని బ్రహ్మాజీ వివరణ ఇచ్చారు.

దుష్ప్రచారాన్ని సహించొద్దు..

- సోషల్ మీడియాలో పోస్టులపై ప్రభుత్వం సీరియస్
- మితిమీరితే ఊరుకోబోనని ముఖ్యమంత్రి హెచ్చరిక

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరద సహాయ కార్యక్రమాలపై సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఆ పోస్టులు పెడుతున్నవారెవరో ఆరా తీయాలని నిర్ణయించింది. మితిమీరితే శిక్ష తప్పదని హెచ్చరిస్తోంది. తాజాగా వరద సాయం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై అనుమానాలు రేకెత్తించేలా సోషల్ మీడియాలో పోస్టులు మొదలయ్యాయి. ఇంతవరకూ కేంద్రం సాయం ప్రకటించకపోవడంపై చంద్రబాబు ప్రభుత్వం అసహనంగా ఉందని... దీంతో ఇరు ప్రభుత్వాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయని ఈ పోస్టుల్లో పేర్కొంటున్నారు. కొద్ది రోజుల్లో కేంద్ర మంత్రివర్గం నుంచి టీడీపీ బయటకు వచ్చేసి, ఎన్డీయే కూటమికి గుడ్ బై చెబుతుందనే ప్రచారం చేస్తున్నారు. కేంద్ర సాయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల క్రితమే స్పష్టత ఇచ్చారు. తాము నష్టానికి సంబంధించి ప్రాథమిక నివేదిక పంపకుండానే కేంద్రం సాయం ప్రకటించడం సాధ్యం కాదని, తాము ఇంకా నివేదిక పంపలేదని చెప్పారు. ఎమరీ అతిగా ప్రవర్తిస్తున్నారు. వైసీపీ నుంచే ఇటువంటి దుష్ప్రచారం నడుస్తోంది. మరీ మితిమీరిపోతే మేం సీరియస్‌గా తీసుకుంటాం. దానికి తగిన శిక్ష ఉంటుంది' అని హెచ్చరించారు.

బెజవాడ అనుభవంతో భద్రం!

- భారీ వర్షాలతో ఉత్తరాంధ్రకు వరద ముప్పు
- ప్రాణ, ఆస్తి, పంట నష్టం తగ్గించాలి
- ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్‌లు
- ఆహార సరఫరాకు డ్రోన్లు వాడండి
- ఏలేరు ప్రాజెక్టు వద్ద గట్టి చర్యలు
- కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విజయవాడ వరదను గమనంలో ఉంచుకుని ముందస్తు చర్యలను వేగంగా తీసుకోవాలని సూచించారు. ప్రభావిత ప్రాంతాల ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్‌లు పంపాలని కోరారు. ఆదివారం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరదల ప్రభావం కనిపిస్తోంది. అన్ని జిల్లాల కలెక్టర్లు కూడా అప్రమత్తం కావాలి. నాగావళి, వంశధార నదులకు వరద పెరిగే అవకాశం ఉంది. ఏలేరు రిజర్వాయర్‌కు ఎక్కువ వరద నీరు రావొచ్చు. ప్రాజెక్ట్‌లోకి వచ్చే ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో బ్యాలెన్స్ చేసుకుని, సమర్థవంతంగా వ్యవహరించాలి. కాలువలు, చెరువులు, డ్రెయిన్లకు గండ్లు పడకుండా చూసుకోవాలి. భారీ, అతిభారీ వర్షాలు పడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో తాగు నీరు, ఆహారం, మెడికల్ క్యాంప్‌లను సిద్ధం చేయాలి. ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, ప్రాణనష్టం లేకుండా చూసుకోవాలి. ముందస్తు చర్యలతో ఆస్తి నష్టాన్ని తగ్గించాలి. పంట నష్టం అంచనా, బాధితులకు ఆహార సరఫరా, వరద పరిస్థితులను గమనించేందుకు డ్రోన్లు వినియోగించాలి. ప్రభావిత ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి. అక్కడ వారికి అన్ని వసతులు కల్పించాలి. పరిస్థితి తీవ్రతను బట్టి, సహాయం కోసం సెంట్రల్ కంట్రోల్ టీమ్‌ను సంప్రదించాలి. ఏజెన్సీలో వాగులు, వంకలు దాటే సమయంలో ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి. వినాయకుని నిమజ్జనం కోసం చెరువులు, కాలువల వద్దకు వెళ్లే భక్తులు, ప్రమాదాలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలవారీగా వర్షపాతం వివరాలను సీఎంకు కలెక్టర్లు వివరించారు. బాపట్ల జిల్లాలోని పునరావాస కేంద్రాల్లో పెరుగుతున్న బాధితులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు పెంచుతున్నామని ఆ జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. రెండువేల మందికి పైగా ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించి, ఆహారం అందిస్తున్నామని ఏలూరు కలెక్టర్ కె. వెట్రి సెల్వి చెప్పారు. విజయనగరంజిల్లాలో భారీ వర్షాలకు అనుగుణంగా రాకపోకలను నియంత్రిస్తున్నామని కలెక్టర్ అంబేడ్కర్ వివరించారు.

పండుగ రోజూ పరామర్శలే

ముఖ్యమంత్రి చంద్రబాబు వినాయకచవితి పండగ రోజు కూడా వరద బాధితులను పరామర్శించేందుకు విజయవాడలో పర్యటించారు. సింగ్‌నగర్‌లో వరదనీరు ఉండటంతో పొక్లెయిన్ ఎక్కి మారుమూల ముంపు ప్రాంతాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఓవైపు వర్షం.. మరోవైపు వరద నీటిలోనే సుమారు మూడు గంటల పాటు సీఎం పర్యటన కొనసాగింది. బాధితులు తమ కష్టాలను ఆయనకు చెప్పుకొన్నారు. తీవ్రంగా నష్టపోయామని, ఇంట్లో ఉన్న వస్తువులు, వాహనాలు అన్నీ దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గండ్లు పూడ్చివేయడంతో వరద నీరు ఒకటి రెండు రోజుల్లో తగ్గిపోతుందని, ప్రతి ఒక్క కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని చంద్రబాబు...బాధితులకు భరోసా ఇచ్చారు. అనంతరం కాన్వాయ్‌లో తిరిగి విజయవాడ కలెక్టరేట్‌కు చేరుకున్నారు.



వరద పరిస్థితిని గవర్నర్‌కు వివరిస్తున్న సీఎం చంద్రబాబు

గవర్నర్‌ను కలిసిన చంద్రబాబు

- ప్రభుత్వ కృషిని ప్రశంసించిన అబ్దుల్ నజీర్

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఇక్కడ కలిశారు. విజయవాడలోని రాజ్ భవన్‌కు వెళ్లిన ఆయన గవర్నర్‌తో సుమారు గంటపాటు భేటీ అయ్యారు. విజయవాడ నగరాన్ని కనీవినీ ఎరుగని రీతిలో వరదలు ముంచెత్తడంతో ఆయన గవర్నర్‌ను కలసి ఈ పరిణామాలను వివరించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా వరదల వల్ల జరిగిన నష్టం, బాధితులను ఆదుకోవడానికి తాము తీసుకొన్న చర్యలను చెప్పారు. ప్రభుత్వం సత్వరం స్పందించి యుద్ధ ప్రాతిపదికన బాధితులను ఆదుకోవడానికి తీసుకొన్న చర్యలను గవర్నర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా బాధ్యత తీసుకొని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించడాన్ని మెచ్చుకొన్నారు. త్వరలోనే ముంపు ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనగలవన్న ఆశాభావాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు.

నేటి నుంచి నష్టం అంచనా

- 2.32 లక్షల నివాసాల్లో సర్వే
- వ్యాపార సంస్థల నష్టం కూడా
- కుటుంబ సభ్యులెవరున్నా నమోదు
- ధ్రువీకరణ కోసం ఆధార్ తప్పనిసరి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన వెల్లడి

విజయవాడ/అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో ఆస్తి నష్టాన్ని అంచనా వేసే కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది. 2.32 లక్షల గృహాలతోపాటు వాణిజ్య వ్యాపార సంస్థలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయనున్నారు. దీనికిగాను రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో 17 వేల బృందాలను ఏర్పాటు చేశారు. నష్టం అంచనా నమోదుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఈ బృందాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) ఆర్పీ సిసోడియా నేతృత్వంలో ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన మీడియాతో మాట్లాడుతూ ఎన్యూమరేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఒక్కో బృందానికీ డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నేతృత్వం వహిస్తారని తెలిపారు. వారితోపాటు వార్డు సెక్రటరీ, వలంటీర్, పోలీసు సిబ్బంది ఒకరు ఉంటారన్నారు. మూడు రోజుల్లో నష్టాన్ని నమోదు చేస్తామన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి వార్డుకు ఒక ఐఏఎస్ అధికారితోపాటు జిల్లా అధికారి ఒకరు పనిచేస్తారని తెలిపారు.

అందుబాటులో ఉండాలి!

ఎన్యూమరేషన్ బృందాలు వచ్చిన సమయంలో గృహ, వ్యాపార సంస్థల యజమానులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సృజన కోరారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వస్తే ఎన్యూమరేషన్‌కు ఇబ్బంది లేకుండా ఉంటుందని సూచించారు. ఏదైనా కారణం వల్ల ఇంట్లో ఎవరూ లేకుంటే వార్డు సెక్రటరీకి సమాచారం ఇస్తే మరోసారి ఇంటికి వచ్చి ఎన్యూమరేషన్ చేస్తారని వివరించారు.

ఇళ్లే మొదట

తొలుత గృహాల్లో నష్టం అంచనాకు ప్రాధాన్యం ఇస్తారని కలెక్టర్ చెప్పారు. ఆ తర్వాత ఆటోలు, రిక్షాలు, తోపుడు బండ్లు తదితరాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కాగా, విద్యార్థులతో కూడిన మరికొన్ని బృందాలు సమాంతర సర్వే నిర్వహించనున్నాయి.

వరద నష్టం 6,882 కోట్లు

- కేంద్రానికి రాష్ట్రం ప్రాథమిక నివేదిక

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా రూ.6,882 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ అనంతరం నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. వరద నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి శనివారం ప్రాథమిక నివేదికను పంపింది. రోడ్లు భవనాల శాఖకు రూ.2,165 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొంది. జలవనరుల శాఖకు 1,569 కోట్లు, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలకు 1,160 కోట్లు, పశు సంవర్థక శాఖకు రూ.12 కోట్లు, వ్యవసాయ శాఖకు 301 కోట్లు, మత్స్య శాఖకు 158 కోట్లు, ఉద్యానవన శాఖకు 40 కోట్లు, విద్యుత్ శాఖకు 481 కోట్లు గ్రామీణ నీటి పారుదల శాఖకు 76 కోట్లు, పంచాయితీరాజ్ పరిధిలోని రోడ్లకు 168 కోట్లు, అగ్నిమాపక శాఖకు 2 కోట్ల నష్టం జరిగినట్టు వివరించింది.

వాహనాల రిపేర్ ఖర్చు

కొంత భరిస్తాం

- ఇళ్లలో పాడైన పరికరాలకూ మరమ్మతులు
- తక్కువ ఖర్చైతే మేమే పెట్టుకొంటాం
- కంపెనీలు, బ్యాంకర్లతో చర్చలు
- ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టత
- రోడ్ల శుభ్రతపై డ్రోన్లతో తనిఖీ: సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదల్లో మునిగిపోయి దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లలో పరికరాల రిపేర్ల ఖర్చులో కొంత ప్రభుత్వం భరించడంపై ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. ఆదివారం రాత్రి విజయవాడ కలెక్టరేట్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "వరదల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాలు పెద్ద సంఖ్యలో మునిగిపోయి దెబ్బ తిన్నాయి. వీటిలో కొన్నింటికి బీమా ఉంది. కొన్నింటికి లేదు. ఆథరైజ్డ్ మెకానిక్కుల వద్ద రిపేర్ చేయిస్తేనే బీమా వస్తుంది. కొందరు యజమానులు తమకు నమ్మకం ఉన్నవారి వద్ద రిపేర్ చేయించుకోవాలని అనుకొంటారు. బీమా లేని వాహనాల రిపేర్లు ఎలాగో ఆలోచించాలి. వాహనాల కంపెనీలతో ఈ విషయం మాట్లాడుతున్నాం. కంపెనీల వద్ద సీఎస్ఆర్ నిధులు ఉంటాయి. వాటి కింద ఉచితంగా రిపేర్లు చేయాలని అడుగుతున్నాం. తక్కువ ఖర్చయితే ప్రభుత్వం తరఫున మేం పెట్టుకొంటాం. మరీ ఎక్కువైతే కొంత ప్రభుత్వం...కొంత యజమానులు భరించేలా ఆలోచన చేస్తున్నాం. వరద ప్రాంతాల్లోని ఇళ్లలో రకరకాల ఎలక్ట్రానిక్ పరికరాలు పాడై పోయాయి. వాటిని ఆయా కంపెనీల తయారీదారులే మరమ్మతు చేయాలి. విడి భాగాలు వాళ్ల వద్దే ఉంటాయి. ఆ కంపెనీలతో కూడా మాట్లాడి తక్కువ ఖర్చుతో రిపేర్లు అయ్యే మార్గం అన్వేషిస్తున్నాం. ఇందులో కూడా వీలైతే కొంత ఖర్చు ప్రభుత్వం పెట్టుకొంటుంది. గ్యాస్ స్టవ్‌లు కూడా వాటిని కొన్న కంపెనీలే రిపేర్ చేయాలి. వాళ్లతో కూడా మాట్లాడుతున్నాం. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటరీ, పెయింటింగ్ వంటి పనులు అర్బన్ కంపెనీకి అప్పగిస్తున్నాం. ఆ కంపెనీకి ఇందులో ప్రావీణ్యం ఉంది. ఇతరత్రా ఎవరైనా ఈ పనులు చేసే వాళ్లు ఉంటే వాళ్లను కూడా ఈ కంపెనీకే అప్పగిస్తున్నాం. రేట్లు తక్కువలో ఉండేలా చూస్తాం. ఇవన్నీ ఒకటి రెండు రోజుల్లో తేలతాయి. వీటన్నింటిపైనా వివరంగా ఒక కరపత్రం తయారు చేసి ఇంటింటికీ పంపిస్తాం" అని ఆయన వివరించారు. చిన్న వ్యాపారాలు చేసుకొనేవారు, షాపులు నిర్వహించేవారు, పెద్ద వ్యాపారాలు చేసేవారు అందరూ నష్టపోయారని, వాళ్లను తిరిగి ఎలా గాడిలో పెట్టాలన్నదానిపై బ్యాంకర్లతో మాట్లాడుతున్నామని, కేంద్రం సహాయం కూడా కోరుతున్నామని ఆయన వివరించారు.

శుభ్రతపై డ్రోన్లతో తనిఖీ

వరద తగ్గిన తర్వాత ముంపు ప్రాంతాల్లో రోడ్లు, కాల్వలు శుభ్రం చేయిస్తున్నామని, ఎలా శుభ్రం చేశారో డ్రోన్లతో తనిఖీ చేయిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. డ్రోన్లు తీసిన వీడియోలు, ఫొటోలను క్షేత్రస్థాయిలో పని చేయించేవారికి పంపి ఎక్కడైనా సరిగ్గా చేయకపోతే మళ్లీ చేయిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు డ్రెయిన్లు శుభ్రం చేయలేదని, వరద కాల్వల పనులు నిలిపివేసిందని ఆయన విమర్శించారు. విజయవాడలో రెండు రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 'బుడమేరు కింద ఆక్రమణలు తొలగిస్తాం. ఈ నీరు సముద్రం చేరేవరకూ ఆటంకాలు లేకుండా అన్నీ తొలగిస్తాం. మళ్లీ విజయవాడకు వరద రాకుండా చేస్తాం' అన్నారు. ఈ 8 రోజుల్లో మొత్తం 97 లక్షల ఆహార ప్యాకెట్లు సరఫరా చేశామన్నారు.

కొలువుదీరిన గణనాథులు

● వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్న గణేశుడు ● విద్యుత్ వెలుగులతో మండపాలు
● మూడు నుంచి తొమ్మిది రోజులు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. గడచిన వారం, పది రోజులుగా మందిరాల ఏర్పాట్లతో నిమగ్నమైన యువత, చిన్నారులు శనివారం వేడుకలను ప్రారంభించారు. మండపాలను విద్యుద్దీపాలతో అలంకరించి వివిధ రూపాల్లో గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు, పారాయణలు చేపడుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం


నరసన్నపేట: కొత్తవీధిలో వినాయక మండపంలో పెద్ద అగర్ బత్తీని వెలిగిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


అరసవల్లి: డీసీసీబీ కాలనీలో స్వామిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్



కాశీబుగ్గ: పదోవార్డు శివాలయం వీధిలో..


ఆమదాలవలస: పట్టణంలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కూన రవికుమార్




టెక్కలి: మెట్ట వీధి, వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి, పాతపట్నం: దువ్వారి వీధిలో వివిధ రూపాల్లో గణేశులు


కంచిలి: స్టేట్ బ్యాంక్ ఎదురుగా..


ఎచ్చెర్ల: బుడగట్లపాలెంలో..


పొందూరు: మార్కెట్ వీధిలో..


ఎల్.ఎన్.పేట: మోదుగవలసలో


హరిపురం: నంది వాహనంపై గణపతి


హిరమండలం: అభయాంజనేయ ఆలయంలో..




నందిగాం: కారిగుడ్డి వీధి, జలుమూరు: శ్రీముఖలింగంలో పూజలు చేస్తున్న భక్తులు, అర్చకులు, ఇచ్ఛాపురంలో 18 అడుగుల గణనాథుడు


రణస్థలంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పలాస: ఉల్లాసపేటలో..


కోటబొమ్మాళి: ఎన్టీఆర్ భవన్‌లో వినాయక ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కుటుంబ సభ్యులు

గణేశుని ఆకృతిలో కర్రపెండలం

కవిటి: బొరివంక గ్రామంలో వినాయకుని ఆకృతిలో కర్ర పెండలం దుంప లభ్యమైంది. ఒరియా వీధిలోని మజ్జి బొనమాళి తోటలో కర్రపెండలం వేశారు. వినాయక చవితి రోజు శనివారం దుంపను తీయగా.. సుమారు నాలుగు అడుగుల మేర వినాయకుడి ముఖం, తొండం ఆకృతిలో కనిపించింది. దీంతో వీధిలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం పక్కనే దీనిని ఉంచి పూజలు చేశారు.



గంజాయి తరలిస్తున్న 9 మంది అరెస్టు

● జిల్లాలో తొలిసారిగా 8మందిని డి-అడిక్షన్ రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలింపు
● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


నిందితులను మీడియా ఎదుట ప్రవేశ పెట్టి మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 8: గంజాయి అక్రమ రవాణా నియంత్రణపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో శనివారం వాహన తనిఖీలు చేయగా.. గంజాయి తరలిస్తున్న తొమ్మిది మందిని అరెస్టు చేశారు. అలాగే జిల్లాలో తొలిసారిగా గంజాయి మత్తులో ఉన్న యువతను పట్టుకుని వారి తల్లిదండ్రుల అంగీకారంతో డీఐజీ ఆదేశాల మేరకు విశాఖపట్నంలోని డి-అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. 'శ్రీకాకుళంలో పొన్నాడ బ్రిడ్జి వద్ద శనివారం డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆధ్వర్యంలో సీఐ పైడపునాయుడు, పోలీసులు వాహన తనిఖీలు చేశారు. రెండు ద్విచక్ర వాహనాలపై నలుగురు గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద 5 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సీఐ విచారణ చేపట్టారు. ఈక్రమంలో సుమారు 25 మంది గంజాయి క్రయవిక్రయాలు, రవాణా సాగిస్తున్నట్టు తెలిసింది. దీంతో డీఎస్పీ, సీఐతోపాటు ఎక్సైజ్ శాఖ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి.. వాంబే కోలనీ సమీపంలో ఉన్న డచ్ బిల్డింగ్‌లో ఐదుగురిని పట్టుకున్నారు. వారి వద్ద 17 కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 9 మందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామ'ని ఎస్పీ తెలిపారు. ● 'ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా కందిలికి చెందిన హరీష్ గుంత గంజాయి వ్యాపారం చేస్తుంటారు. అదే గ్రామానికి చెందిన బంక జోసెఫ్‌తో కలిసి.. ఒడిశాలో గంజాయి సాగు చేసే వ్యక్తి వద్ద కేజీ గంజాయి రూ.3 వేలకు కొనుగోలు చేశారు. దానిని శ్రీకాకుళం నగరానికి చెందిన పల్లం శెట్టి చందు, సైలాడ వేణుగోపాలరావు, కొల్లి యశోదరావు, అందాల సాయి నిఖిల్, జలగడుగుల వికాస్, చీకటి యోగేశ్వరరావు, జామి మోహన్‌కృష్ణ, జలగడుగుల కృష్ణ వంశీ, జలగడుగుల వికాస్‌తో పాటు మరి కొందరికి కేజీ రూ.5వేలకు విక్రయిస్తున్నారు. వీరు శ్రీకాకుళం తరలించగా చందు.. 30 గ్రాముల గంజాయిని.. రూ.400కు విక్రయించి.. కేజీకి రూ.10వేల వరకూ లాభం పొందుతున్నాడని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పల్లం శెట్టి చందు, కోలా అరుణ్‌కుమార్, సైలాడ వేణుగోపాలరావు,కొల్లి యశోదరావు, చీకటి యోగేశ్వరరావు, జామి మోహన్ కృష్ణ, జలగడుగుల కృష్ణవంశీ,హరీష్ గుంత,బంక జోసెఫ్‌లను గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా వారిని రిమాండ్‌కు తరలించామన్నారు. తెలిపారు. అలాగే అందాల సాయి నిఖిల్, జలగడుగుల వికాస్‌తోపాటు ఒడిశాలో గంజాయి విక్రయిస్తున్న మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు. ● ఈ కేసులో 9 మంది అరెస్టు కాగా.. వారు గంజాయిని ఎవరికి విక్రయించారన్నదానిపై కూడా విచారణ చేపట్టామని ఎస్పీ తెలిపారు. గంజాయి మత్తుకు బానిసైన నగరానికి చెందిన మరో 8 మందిని విశాఖపట్నంలోని డి-అడిక్షన్ (రీహెబిలిటేషన్) సెంటర్‌కు తరలించామన్నారు. సమావేశంలో డీఎస్పీ వివేకానంద, సీఐలు పైడపునాయుడు, ఇమ్మాన్యుయేలు రాజు, ఎస్ఐలు వాసుదేవ్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడితో నలుగురు విద్యార్థులకు గాయాలు

మెళియాపుట్టి: మండలం కేంద్రంలో ఆదివారం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేసి నలు గురు విద్యార్థులను గాయపరిచాయి. గ్రామానికి చెందిన సారధి శ్రీభరత్ (7), హర్షవర్ధన్ (10), రెల్లివలస నేతాజీ (10), కొత్తవలస గౌతం (5) లకు కుక్కలు కాటు వేయడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే వీరిని మెళియాపుట్టి ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్యసేవలు అందించారు. చికెన్ దుకాణాలు, మూడు రోడ్ల జంక్షన్ వద్ద కుక్కలు గుంపులుగా సంచరిస్తూ వాహనదారులపైకి దాడులు చేస్తున్నాయని, వీటిని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.



వరద బాధితులకు రూ.లక్ష విరాళం



పలాస: విజయవాడలోని వరద బాధితుల సహాయం కోసం స్థానిక వ్యాపారి పెంట బాల రూ.లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీషకు శనివారం అందించారు. ఈ మొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వర రావు యాదవ్, బాల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడిన వైద్యురాలు

నరసన్నపేట/కోటబొమ్మాళి: అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన ఓ వ్యక్తికి సీపీఆర్ చేసి ప్రాణం కాపాడిన ఘటన కోటబొమ్మాళి పట్టణంలోని విద్యుత్ నగర్‌లో శనివారం సంభవించింది. వివరాలిలా ఉన్నాయి.. విద్యుత్ నగర్‌లో నివాసం ఉంటున్న చిన్నప్పన్న అనే వ్యక్తి ఒక్కసారి అనారోగ్యానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అయితే ఏం జరిగిందో తెలియక కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతూ ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు యత్నిస్తుండగా అటుగా వెళుతున్న ఫిజియోథెరపీ వైద్యురాలు సంధ్యారాణి స్పందించారు. సదరు వ్యక్తి ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించి వెంటనే సీపీఆర్ (కార్డియో పల్మోనరీ రిసస్సిటేషన్) సేవలను అందించారు. కొద్ది సమయం తరువాత చిన్నప్పన్న కొలుకుని సాధారణ స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన డా.సంధ్యారాణిని వారు అభినందించారు.

సెలవులు వస్తే వారికి పండగే..

● కంకర అక్రమ తరలింపు
● పట్టించుకోని అధికారులు

మెళియాపుట్టి: సెలవు దినం వస్తే చాలు వారికి పండగే.. అక్రమంగా కంకర తరలించుకుపోతున్నా పట్టించుకునే వారే లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. వారు పాడిందే పాటగా సాగుతోంది. సెలవు రోజుల్లో రెచ్చిపోయి కంకరను తరలించుకుపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న కొండ నుంచి కంకరను తరలిస్తు న్నారు. శనివారం వినియక చవితి సెలవు దినం కావడంతో వారు ఎక్స్‌కవేటర్ల సాయంతో కంకరను ట్రాక్టర్లలో నింపి తరలించేశారు. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెలవు రోజులు వస్తే గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంటోంది. తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఇలా ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అనుచరులు కొండ కంకరను తర లించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అధికారులను ఎక్స్‌కవేటర్ యజమాని మేనేజ్ చేసి కంకరను తరలిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు పేర్లు చెప్పి తరలిస్తుడడంతో అటు రెవెన్యూ ఇటు పోలీస్‌లు సైతం చూసీ చూడనట్టు వ్యవరిస్తున్నారన్న ఆరోపణలొస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరు తున్నారు. దీనిపై వీఆర్వో కోటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా కంకర తరలింపు విషయం తెలిసిన వెంటనే సంబంధిత యజమానిని పిలిచి తక్షణం నిలుపుదల చేయాలని సూచించానని, తరలింపు నిలిపివేశారన్నారు.


కంకర తవ్వుతున్న దృశ్యం

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

జలుమూరు: వంశధార నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు అన్నారు. పర్లాం, రామకృష్ణాపురం ఇసుక ర్యాంపులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నది నుంచి ఇసుకను ట్రాక్టర్లతో రాత్రివేళ తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో పర్లాం, దొంపాక ఇసుక ర్యాంపుల వద్ద వీఆర్వోలతో రాత్రివేళ గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు వీఆర్వోలు గోపి, సింహాచలం, నాగేశ్వరరావు ఉన్నారు.


పర్లాం ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు

జీవో 117ను రద్దు చేయాలి

టెక్కలి: ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు 117వ జీవోను రద్దు చేయాలని యూటీ ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శంకరరావు అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మాధ్యమాలు ఉండేలా చూడాలన్నారు. అన్ని గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మందసలో నవంబరులో జిల్లా మహాసభలు, డిసెంబరులో కాకినాడలో జరుగు స్వర్ణోత్సవ సభ నిర్వహిస్తున్నామని, వీటిని జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ టెక్కలి మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.గణపతిరావు, ప్రదానకార్యదర్శిగా వైకుంఠ రావు, కోశాధికారిగా విజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా ప్రభావతి, పాపారావు, గౌరవాధ్యక్షుడిగా కుమార స్వామిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు యూటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో దెబ్బతిన్న సీటి బ్రేకర్ వ్యవస్థ

నరసన్నపేట: స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఓ ఉడుత సీటీ బ్రేకర్‌పైకి రావడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి ఈ వ్యవస్థ దెబ్బతింది. దీంతో పెద్ద శబ్దాలు వచ్చి పెను ప్రమాదం తప్పింది. ఆదివారం మధ్యాహ్నం వర్షం పడుతున్న సమయంలో ఉడుత సబ్ స్టేషన్‌లోని ఏడు ఫీడర్లను అనుసంధానం చేసే గ్రూప్ ఎల్‌వీ బ్రేకర్ వద్దకు రావడంతో షార్టు సర్క్యూట్ అయింది. దీంతో రూ.40 వేలు విలువ చేసే సీటీ (కరెంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ వ్యవస్థ) దెబ్బతింది. ఈ కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలకు, గ్రామాలకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. వెంటనే సిబ్బంది స్పందించి తాత్కాలికంగా మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత సీటీ వ్యవస్థను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తామని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు.

కార్మిక చట్టాల పునరుద్ధరించాలి

● పీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్

పలాసరూరల్: అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, వీటిని పునరుద్ధరించుకునేందుకు పోరాటాలు తప్పవని పీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ అన్నారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా రెండో మహా సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాన పనికి సమాన వేతనం అందడం లేదని, ఈ విషయంలో పాలకులు శ్రద్ధ చూపించడం లేదన్నారు. అనేక పోరాటాల ద్వారా 44 చట్టాలు సాధించుకుంటే పాలకులు వాటిని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మర్చిందని విమర్శించారు. అడవుల్లో నివసిస్తున్న ఆదివాసీలను తరిమికొట్టేందుకు ఆపరేషన్ కగార్‌ను ప్రధాని మోదీ సర్కార్ అమలు చేస్తోందన్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు ఎంతో మంది ఆదివాసీలను, మావోయిస్టులను పొట్టన పెట్టుకున్నారని, ప్రస్తుత కేంద్ర పాలనలో స్త్రీలకు రక్షణ లేకుండా పోయిం దన్నారు. కార్యక్రమానికి దేవాడ నారాయణమూర్తి అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి బి.కొండా రెడ్డి, జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన, మద్దిల ధర్మారావు, కుల నిర్మూలనా సమితి జిల్లా నేత బెల్లమర ప్రభాకర్, డీటీఎఫ్ నేత కోత ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు జోగి కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో జనసేనని బలోపేతం చేయాలి

నందిగాం: గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్ర మోహన్ అన్నారు. ఆదివారం ఆనందపురం పంచాయతీ మాదిగాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పార్టీ జెండాలను ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆనందపురం, మాదిగాపురం గ్రామాలకు చెందిన బుజ్జి, విష్ణు, సురేష్, మనోజ్, రాజ్యలక్ష్మి, ఉషారాణి, శాంతి, దమయంతి తదితరులు పార్టీలో చేరారు. వీరికి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తాడేల చిరంజీవులు, జిల్లా కార్యదర్శి ఎస్.షణ్ముఖరావు, సోమేశ్వరరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


జనసేన పార్టీలో చేరిన వారితో నేతలు

విజయవాడ వెళ్లిన శానిటేషన్ సిబ్బంది



పాతపట్నం: విజయవాడలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో సేవలందించేందుకు పాతపట్నం మేజర్ పంచాయతీ నుంచి శానిటేషన్ సిబ్బంది, ఎలక్ట్రీషియన్ ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు వీరిని విజయవాడ పంపుతున్నట్లు సర్పంచ్ సిర్ల వేణుకుమారి తెలిపారు.

నేత్రదానంతో ఇతరుల కళ్లలో వెలుగులు

టెక్కలి: నేత్రదానం చేయడం ద్వారా ఇతరుల కళ్లల్లో వెలుగులు చూడవచ్చని ప్రజా చైతన్య కళా సమితి అధ్యక్షుడు యు.గణపతిరావు అన్నారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరణాంతరం మాత్రమే నేత్రదానం చేయాలని, కార్నియాను మాత్రమే సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు ప్రసాదరావు, సంఘం ప్రతినిధులు చిట్టెన్న, భాస్కరరావు, కృష్ణమూర్తి, రమణమూర్తి పాల్గొన్నారు.

నిలకడగా వంశధార

హిరమండలం: గొట్టాబ్యారేజీ వద్ద వంశధార నీటి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. స్థానికంగా కురిసిన వర్షాలతో నదిలో స్వల్పంగా నీటి ప్రవాహం పెరిగింది. ఆదివారం రాత్రి 6 గంటల సమయానికి ఇన్‌ఫ్లో 7,196 క్యూసెక్కులు రాగా బ్యారేజి 10 గేట్లు 20 సెంటీమీటర్లు పైకెత్తి వచ్చిన నీటిని సముద్రం లోకి విడిచిపెడుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాలువలు గేట్లు మూసివేశారు. ఇదిలా ఉండగా నదీ ప్రవాహాన్ని టీడీపీ నాయకులు పరిశీలించారు.

గొట్టా బ్యారేజీకి విద్యుత్ వెలుగులు

హిరమండలం: మూడేళ్ల తరువాత గొట్టా బ్యారేజీకి విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం బ్యారేజీ నిర్వహణకు ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడంతో లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో గత కొన్నేళ్లుగా రాత్రి పూట బ్యారేజీ అంధకారంలో ఉండడంతో వాహన చోదకులు, వరదలు వచ్చేటప్పుడు అధికారులు ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రూ.3 లక్షలు నిధుల కేటాయించారు. ఈ నిధులతో వైరింగ్ మరమ్మతులు చేపట్టడంతో పాటు లైట్లను వేయడంతో ప్రస్తుతం బ్యారేజీ విద్యుత్ వెలుగులను విరజిమ్ముతోంది.


విద్యుత్ వెలుగులో కళకళలాడుతున్న గొట్టాబ్యారేజీ



జి.సిగడాం: గెడ్డకంచరాం వీధుల్లో ప్రవహిస్తున్న వర్షపునీరు



శ్రీకాకుళం డేఅండ్‌నైట్ కూడలి సమీపాన ఫారెస్ట్ కార్యాలయం వద్ద..



నరసన్నపేట: గొట్టిపల్లి అండర్ పాసేజ్ వద్ద

కుండపోత!

- పొంగిపొర్లుతున్న వాగులు
- కాలువలకు గండ్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీటమునిగిన పంట పొలాలు
- పలుచోట్ల నిలిచిన రాకపోకలు

జిల్లాలో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మరోవైపు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల కాలువలకు గండ్లు పడ్డాయి. వరి పొలాలు నీట మునిగాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

- ఆంధ్రజ్యోతి బృందం

పొంగుతున్న కాలువలు

జి.సిగడాం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గెడ్డకంచరాం వద్ద పెద్దగెడ్డ నీటి ఉధృతికి గదబపేట, కిట్లపేట, కృష్ణంరాజులపేట గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెనసాం గ్రామం వద్ద పాపచెరువు గెడ్డపైకు గండిపడడంతో పంట పొలాలపై వరద నీరు ప్రవహిస్తుంది. పెంట, మర్రివలస గ్రామాల్లో పంట పొలాలు మునిగిపోయాయి. నర్సింపురం గ్రామంలో నరసమ్మ చెరువుకు గండి కొట్టంతో గ్రామం జలమయమైంది. సుద్దగెడ్డ వద్ద పూనె పలు చోట్ల గండిపడడంతో పంట పొలాలు నీట మునిగాయి. టీడీవలస- సంతకవిటి మండలం మండాకురిటి మధ్యలో గల రెల్లిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్), తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో నిశ్చల, ఆర్ఐ రామచంద్రరావు తదితరులు ముంపు ప్రాంతాలను పరిశీలించారు.



జి.సిగడాం: పెంట- మర్రివలస గ్రామాల మధ్య నీటమునిగిన పంట పొలాలు

ఎగసి పడుతున్న సముద్రపు అలలు

గార: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లాలోని సముద్ర తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. బందరువానిపేటలో పడవలు, వలలు, తెప్పలు ఎత్తు ప్రదేశాలకు తరలించి సురక్షితంగా భద్రపరచు కుంటున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని ఎఫ్‌డీవో బగాది సురేష్‌కుమార్ సూచించారు.

● **టెక్కలి:** పట్టణంలోని భూలోకమాత వీధిలో నాగ వంశపు శ్యామలరావు ఇంటి గోడ వర్షాలకు కూలి పోయింది. ● **పాతపట్నం:** కాజ్‌వే పైనుంచి మహేంద్రతనయ ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాజ్‌వే వంతెన పైనుంచి కె.గోపాలపురం, హెచ్.గోపాలపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



గార: బందరువానిపేట వద్ద ముందుకు వచ్చిన సముద్రం

ఉధృతంగా గెడ్డలు, వాగులు

లావేరు: మండలంలోని గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. అదపాక- గుర్రాలపాలెం, రాయినింగారిపేట, బెజ్జిపురం- బుడతవలస, లక్ష్మీపురం-పట్నావానిపేట వద్ద పెద గెడ్డ ఉధృతంగా పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బెజ్జిపురం- బుడతవలస మధ్య గెడ్డలో ఓ లగేజీ వ్యాన్ నీటి ఉధృతికి కొంత దూరం కొట్టుకుపోయింది. స్థానికులు స్పందించి ట్రాక్టర్ సాయంతో కొట్టుకుపోయిన వ్యాన్‌ను బయటకు తీసుకుని వచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ జరుగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అదపాక, రాయినింగారిపేట, బుడతవలస, లక్ష్మీపురం గ్రామాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలను పరిశీలించారు. అదపాక గెడ్డ వద్ద రహదారికి అడ్డంగా తాడు కట్టి రాకపోకలను నిలిపివేశారు. మండల ప్రత్యేకాధికారి ఆర్.శ్రీనివాసరావు, ఎంపీడీ వో కె.సురేష్ కుమార్, తహసీల్దార్ వై.జోగారావు, పీఆర్ఏఈ లింగాల అప్పన్న, టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, బీజేపీ నేత ఇజ్జాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



లావేరు: అదపాక పెద్దగెడ్డ వద్ద పరిస్థితి

ఆక్రమణలతో ఉప్పొంగిన బుచ్చివాని గెడ్డ

రణస్థలం: కోటపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న బుచ్చివాని గెడ్డ పొంగి పొర్లుతోంది. ఈ గెడ్డ ఆక్రమణకు గురవ్వడమే కాకుండా గెడ్డ మధ్యలో కిలోమీటరు మేర రోడ్డు ఏర్పాటు, 32 చోట్ల కాంక్రీట్ చప్టాలు వేయడంతో నీటి ప్రవాహానికి అంతరం ఏర్పడింది. దీంతో వరద నీరు ఉప్పొంగి బీటీ రోడ్డు మీదుగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. కాగా ఈ ఆక్రమణలను గుర్తించిన రెవెన్యూ అధికారులు.. తొలగించడంలో తాత్సారం చేస్తుండడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



జి.సిగడాం: గెడ్డకంచరాంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్



లావేరు: అదపాక గెడ్డవద్ద తాడుకట్టి రాకపోకలను అడ్డుకున్న అధికారులు



బూర్జ: మండల కేంద్రంలోని సెగిడివీధి వద్ద నాగావళి నదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్



నరసన్నపేట: గొట్టిపల్లి అండర్ పాసేజ్ వద్ద అవస్థలు పడుతున్న ద్విచక్ర వాహనదారుడు



మెళియాపుట్టి: బడిసిరిపురం వద్ద..



టెక్కలి: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చేరిన నీరు



పాతపట్నం: ఉధృతంగా మహేంద్రతనయ నది



ఎల్ఎన్ పేట: దబ్బపాడు వద్ద టీడీపీ నాయకుల పరిశీలన



జలుమూరు: పాగోడు వద్ద నీట మునిగిన వరి పంట



హరిపురం: కళింగదల్ రిజర్వాయర్ వద్ద..



హిరమండలం: గొట్టా బ్యారేజి వద్ద వరద పరిస్థితి పరిశీలిస్తున్న టెక్కలి ఆర్డీవో సుదర్శన దొర



కొత్తూరు: నదీతీర ప్రాంతాలను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు



పలాసరూరల్: కేదారిపురం వద్ద వరహాలగెడ్డ నీటి ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు



గార: చెకుళ్లపేట కోమటి చెరువు చెక్‌డ్యాం వద్ద..



కవిటి: మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం



సరుబుజ్జిలి: అలికాం-బత్తిలి రోడ్డు దుస్థితి



పొందూరు: మొదలవలస వద్ద రెల్లిగెడ్డ..



ఎచ్చెర్ల: రుప్పపేట గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

చికిత్స పొందుతూ సెబ్ మహిళ కానిస్టేబుల్ మృతి

నరసన్నపేట: పట్టణంలో జగన్నాథపురంలో ఉంటున్న సెబ్ మహిళ కానిస్టేబుల్ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ నెల 5న ఈమె పరుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా శ్రీకాకుళంలో చికిత్సకు తరలించిన సంగతి తెలిసిందే. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమంగా మారడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. అనూష తల్లి అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



అనూష (ఫైల్)

భర్త అరెస్టు

అనూష ఆత్మహత్య కేసులో ఆమె భర్త, సెబ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కుమిలి విజయ్‌కుమార్‌ను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. భర్త వేధింపులు భరించలేక తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని అనూష తల్లి అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. నిందితుడు విజయ్‌కుమార్ శ్రీకాకుళం ఎస్ఈబీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్టు తెలిపారు. నిత్యం మద్యం తాగి భార్యను అనుమానించడంతోనే మనస్తాపం చెంది తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి ఫిర్యాదులో పేర్కొన్నట్టు సీఐ తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం

పోలాకి: రాళ్లపాడు పంచాయతీ ముప్పిడి గ్రామానికి చెందిన డొంకాన లక్ష్మీదేవి (80) శనివారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు వీఆర్వో బోర నర్సునాయుడు దృష్టికి తీసుకువెళ్లగా.. ఆయన తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎస్ఐ రంజిత్‌కు ఆదివారం సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం వినాయక చవితి పూజలు చేసుకుని ఆమె బంధువులుంటున్న కొల్లివలస వెళ్లింది. రాత్రయినా రాకపోవడంతో ముప్పిడిలో ఉంటున్న కుటుంబ సభ్యులు వాకబు చేయగా బంధువుల ఇంటికి రాలేదని తెలిసి వారు ఆందోళన చెంది అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎస్ఐ రంజిత్ వంశధార కాలువ వద్ద సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లను రప్పించి గాలించినా ఆమె ఆచూకీ కనిపించలేదని, వర్షం వల్ల కాలువల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గాలింపు చర్యలు ఆలస్యమవుతోందని పోలీసులు తెలిపారు. సోమవారం కూడా గాలింపు చర్యలు చేపడతామని వారు తెలిపారు. వృద్ధురాలు బహిర్భూమికి సమీపంలో ఉన్న వంశధార కాలువ వద్దకు వెళ్లి కాలువలో జారిపడి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు.

చోరీ ఘటనలో బంగారు ఆభరణాల రికవరీ

టెక్కలి: టెక్కలి, జలుమూరు, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ చోరీలకు పాల్పడిన దొంగల నుంచి 80 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.8 వేలు నగదు, మొబైల్ ఫోన్, పల్సర్ బైక్ రికవరీ చేసినట్టు సీఐ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఒడిశాకు చెందిన సిబూ దాస్, తరేమీరావు, బెంగాళ్‌కు చెందిన దిలీప్‌రాయి, దీపాంకర్ రాయ్‌లు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ఆగస్టు 19న పోలీసులకు వీరు పట్టుబడ్డారని, వీరి నుంచి కొంత దొంగ సొత్తును రికవరీ చేసేందుకు టెక్కలి కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. విచారణ చేపట్టి మిగిలిన రికవరీ చేశామన్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

ఎంపీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్



గెడ్డగొర్లెపేట వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎంపీ కలిశెట్టి

రణస్థలం: వాయుగుండం ప్రభావంతో రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రణస్థలంలోని తన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఆదివారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. నలుగురు వ్యక్తులతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు, 24 గంటలు అందుబాటులో ఉంటారని ఏ అవసరం వచ్చిన 8919060911, 8639320927 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ప్రజలను కోరారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పది గంటల సమయంలో కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే అర్ధరాత్రి వరకు ఉండి, అనంతరం లావేరు మండలం గెడ్డగొర్లెపేటలో పర్యటించి పరిస్థితిపై ఆరా తీశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం: మండలంల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్లకూడదని తహసీల్దార్ వెంకటరావు అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గ్రామస్థాయిలో సచివాలయాల వద్ద స్టాఫ్‌ని కంట్రోల్ రూమ్ ఓపెన్ చేయాలని తెలిపారు. డొంకూరు, లక్ష్మీపురం, బూర్జపాడు పరిసర గ్రామాల్లో ఉన్న ఫిషరీస్ సముద్ర వేటకు మూడు రోజులు పాటు వెళ్లకూడదని తెలిపారు. బావుల్లో క్లోరినేషన్, కాలువల్లో బ్లీచింగ్ చల్లాలని సూచించారు. పట్టణ ఎస్ఐ చిన్నమనాయుడు, డీటీ గురుప్రసాద్, ఇరిగేషన్ ఏఈ పాణిగ్రాహి పాల్గొన్నారు.

● **కంచిలి:** వాయుగుండం ప్రభావంతో జిల్లాలో మూడురోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అప్రమత్తం చేయాలని ఎంపీడీవో అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాయుగుండం ప్రభావంతో భారీ వర్ష సూచన ఉన్నందున ఆరెంజ్ అలర్ట్ జారీ చేయనున్నందున కలెక్టర్ ఆదేశాల మేరకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద ఏర్పాటు ఏర్పాటు చేసిన టెంట్లు వద్ద ప్రజలెవ్వరూ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ అండ్ శ్యానిటేషన్ చూసుకోవాలని గ్రామాల్లో ఎటువంటి నష్టం జరిగినే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండేవిధంగా దండోరా వేయాలని తెలిపారు.

సచివాలయ సిబ్బందికి పని కల్పించండి

బూర్జ: సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి పని కల్పించాలని మండల అధికారులకు ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. ఆదివారం బూర్జ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కర్నేన దీప అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ భ్రష్టు పట్టిందని సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని, వారు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. వారికి హెచ్చరిస్తూ అంకిత భావంతో పనిచేసేలా పనితీరును మార్చాలని అధికారులకు ఆదేశించారు. సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించి లోపాలను సరిచేసి పనితీరు బాగా లేనివారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున నదీతీర గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపిపి కరేన్న దీప, ఏవో శ్రీనివారావు, ఆర్అండ్‌బీ అధికారి నాయక్, జడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, వైస్ ఎంపీపీలు సూర్యారావు, కృష్ణంనాయుడు, ఎంపీడీవో ఉరిటి శ్రీనివాసరావు, తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, నాయకులు ఆనెపు రామకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి

శ్రీకాకుళం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గడిచిన రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉన్నందున ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. మండలంలోని కుందువానిపేటలో ఆదివారం పర్యటించి హుద్‌హుద్ ఇళ్లను ఆయన పరిశీలించారు. శ్లాబ్‌లకు పూర్తిగా పెచ్చులూడిపోయి, వర్షపు నీరు ఇళ్లల్లోకి కారిపోతుండటాన్ని ఆయన గమనించారు. కూలిపోయేందుకు భవనాలు సిద్ధంగా ఉన్నాయని తమను ఆదుకోవాలని లబ్ధిదారులు ఎమ్మెల్యేను వేడుకున్నారు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.



శిథిలమైన భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రత్యేకాధికారి పరిశీలన

శ్రీకాకుళం రూరల్: బంగాళఖాతంలో అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రూరల్ మండలంలోని పొన్నాం, బట్టేరు, రోణంకి ప్రాంతాల్లో స్పెషల్ ఆఫీసర్, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.గణపతిరావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నదీతీర ప్రాంతాలను పరిశీలించి, గ్రామాల ముంపునకు గురయ్యే అవకాశాలపై అంచనా వేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే, సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని సూచించారు.

● **ఆమదాలవలస:** అల్పపీడన ద్రోణితో కురుస్తున్న భారీ వర్షాలు వల్ల అన్ని శాఖల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్ తెలిపారు. ఆదివారం కలివరం గ్రామం వద్ద తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వాసుదేవరావుతో కలిసి నాగావళి నదీ పరివార ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశీలనలో వెంకటేష్, ఈవోఆర్‌డీ, వీఆర్వో, కార్యదర్శి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

గుజరాతీపేట: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ ప్రభుత్వానికి కోరారు. స్థానిక రామలక్ష్మణ జంక్షన్‌లో గల క్రాంతి భవన్‌లో ఏపీటీఎఫ్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవో 117 రద్దు చేసిన తర్వాత డీఎస్సీ రిక్రూట్‌మెంట్ చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. మున్సిపల్, కేజీబీవీ, మోడల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ వంటి నూతన పెన్షన్ విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఒక్క పాతపెన్షన్ విధానాన్ని మాత్రమే అంగీకరిస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొప్పల భానుమూర్తి అన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి దాసరి రామ్మోహనరావు సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ అనిల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్యాం సుందర్, సభ్యులు పి.అప్పలనాయుడు, బి.డిల్లేశ్వరరావు, జి.భీమారావు, బి.నేతాజీరావు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా అంబటి

అరసవల్లి: శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ పార్టీ (డీసీసీ) అధ్యక్షుడగా అంబటి కృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. తనకి పదవి దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు. తన శక్తి వంచన లేకుండా జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తానని, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడడమే ధ్యేయమన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఏఐసీసీ నాయకులు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, వేణుగోపాల్, వైఎస్ షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.



అంబటి కృష్ణారావు

ఆదిత్యుని ఆదాయం రూ.82,136

అరసవల్లి: భారీ వర్షాల కారణంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి దర్శనానికి భక్తులు కొద్ది సంఖ్యలో వచ్చారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి రూ.82,136 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.6100, విరాళాల ద్వారా రూ.24,951, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.51,085 లభించినట్టు అలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు తెలిపారు.

ఈవోగా మోహన్‌బాబు

పొందూరు: పొందూరు మేజర్‌పంచాయతీ కార్యనిర్వాహక అధికారి (ఈవో)గా కె. మోహన్‌బాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మందస ఈవోగా పనిచేస్తున్న మోహన్‌బాబు డిప్యుటేషన్‌పై పొందూరు ఈవోగా విధుల్లో చేరారు. పొందూరు ఇన్‌చార్జి ఈవోగా నిచేస్తున్న ఎస్ రమేష్ తిరిగి కొంచాడ పంచాయతీ కార్యదర్శిగా వెళ్లారు.

పాయితారిలో రేషన్ డిపో

ఇచ్ఛాపురం: పంచాయతీ ప్రజలకు మరింత చేరువలో ఉండేందుకే రేషన్ డిపో ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పాయితారి పంచాయతీలో నూతన రేషన్ డిపోను ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు లోపింటి పద్మనాభం, జాని, సహ దేవ్‌రెడ్డి, సూర్యనారాయణ, డిల్లీరావు, ప్రకాష్ మండ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చెరువులో పడి గేదె మృతి

రణస్థలం: మండల కేంద్రానికి చెందిన గంగి నాగమణికి చెందిన గేదె ఆదివారం మృతి చెందింది. చెరువు వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయింది. కాళ్లకు జోడాలు ఉండడం వల్ల ఈదలేక మృతి చెందిందని, నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని ఏడీ దుర్గారావు తెలిపారు.